

రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా శాసనమండలి, శాసనసభ ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి గారు రైతు భరోసా మొదటి విడతగా విడుదల చేసిన నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.


నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 24, మార్చి 2026 పేజీలు:4


# వాహన్ పోర్టల్ ప్రారంభం

**• వరుణ్ మోటార్స్ వద్ద లాంఛనంగా ప్రారంభించిన మంత్రి పొన్నం • రవాణా శాఖలోని పౌర సేవలు ఇక సులభతరం • రెండో వాహనం కొనుగోలు చేసిన వారికి 2% ట్యాక్స్ రద్దు**



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి 23:

''వన్ నేషన్- వన్ రిజిస్ట్రీ'' లక్ష్యంతో దేశవ్యాప్తంగా వాహనాల డేటాను ఒకేచోట చేర్చే 'వాహన్' పోర్టల్‌లో తెలంగాణ చేరింది. ఈ పోర్టల్ అందుబాటులోకి రావడంతో రవాణా శాఖలోని పలు పౌరుల సేవలు మరింత సులభతరం కానున్నాయి. పారదర్శకం కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలోని వరుణ్ మోటార్స్ వద్ద 'వాహన్' పోర్టల్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'వాహన్ పోర్టల్' ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఇది తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం. ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తరువాత రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. దేశంలో అన్ని రాష్ట్రాలు వాహన్ సారథిలో ఉండేవి గత సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం సారథిలో చేరాం. వాహన్ పోర్టల్‌లో చేరడం దారా సోమవారం నుండి రెండో వాహనం కొనుగోలు చేసే వారికి 2శాతం అదనపు టాక్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 చెక్కు పోస్టులు ఎత్తివేశాం.. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం.. రవాణా శాఖ ఈవి పాలసీ,స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం అన్నారు. షో రూమ్‌లలో పారదర్శకంగా వాహనాల రిజిస్టేషన్ అయ్యేలా చేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రవాణా శాఖ చేస్తున్న సంస్కరణలు, రోడ్ సేఫ్టీ పై కేంద్రంలోనే తెలంగాణ ను గడ్కరీ గారు అభినందించారు. ఈవీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు తెలంగాణ బ్రాండ్ గా మారుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రవాణా శాఖ ఈ డిజిటల్ మార్పును ముందుకు తీసుకెళ్తోంది. మన రాష్ట్రంలో రోజుకు సుమారు 1,500 వాహనాలు కొత్తగా రోడ్లపైకి వస్తున్నాయి. ఇలాంటి భారీ సంఖ్యలో వాహనాల సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం. ఈ అవసరాన్ని తీర్చడానికి వాహన్ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పోర్టల్ ద్వారా వాహనాలకు సంబంధించిన అన్ని వివరాలు ఒకే జాతీయ డేటాబేస్‌లో సమీకరించబడతాయి. దీని వల్ల సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయి. వాహన రిజిస్ట్రేషన్, ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్, పన్నుల చెల్లింపు వంటి సేవలు ఇప్పుడు ప్రజలకు సులభంగా అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం ప్రజలకు ఆర్థికంగా కూడా ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకుంది. సోమవారం నుండి రెండవ మరియు తదుపరి వ్యక్తిగత వాహనాలపై ఉన్న అదనపు 2% జీవితకాల పన్నును రద్దు చేస్తున్నాము. ఇది ప్రజలకు ప్రయోజనం కలిగిస్తుంది. వాహన్ పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన డేటా లభించి, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, మరియు భవిష్యత్ ప్రణాళికల్లో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుందన్నారు.

# మాది స్మార్ట్ గవర్నెన్స్



**• విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి బీమా అందచేత • సిగ్నల్స్ ఫ్రీ సిటీ కోసం కసరత్తు • మధు రిడ్జ్ పార్క్ అపార్ట్మెంట్ దేనికీ పనికిరాదు • కేంద్రం సూచనతోనే మెట్రో స్వాధీనం.. • శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి 23:

రాష్ట్రంలో తమది కేవలం గుడ్ గవర్నెన్స్ కాదని.. 'స్మార్ట్ గవర్నెన్స్' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ శాసనమండలిలో హైదరాబాద్ నగరాభివృద్ధి పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఐదు మెట్రో నగరాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం కారణంగా పాఠశాలలకు, కార్యాలయాలకు సెలవులు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ముంబైలో వర్షం వచ్చిందంటే జనజీవనం స్తంభించి ఎటూ కదలలేని పరిస్థితి ఉంటుందని అన్నారు. కానీ హైదరాబాద్ అంటే 'లేక్స్ అండ్ రాక్ సిటీ' అని కొనియాడారు. ప్రస్తుతం ఓల్డ్ సిటీగా పిలవబడే ప్రాంతమే అసలైన ఒరిజినల్ సిటీ అని ఆయన స్పష్టం చేశారు. అద్భుతమైన హైదరాబాద్ నగరంలో మానవ తప్పిదాల వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజల ఆర్థిక స్తోమత పెరగడంతో వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్య తీవ్రమైందన్నారు. అందుకే గతంలో బేగంపేట నుంచి శంషాబాద్‌కు విమానాశ్రయాన్ని తరలించామని గుర్తు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో రద్దీని తగ్గించేందుకు చర్లపల్లి టెర్మినల్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గతంలో దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో.. ప్రస్తుతం 9వ స్థానానికి పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ పాలసీతో ముందుకు వెళ్తోందని చెప్పారు. కాలుష్యకారక పరిశ్రమలను పూర్తిగా ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలిస్తామని, ఆ భూములను మల్టీ జోన్లుగా వినియోగించుకోవచ్చని సీఎం స్పష్టం చేశారు.

## కేంద్రం సూచనతోనే మెట్రో స్వాధీనం..

మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ సహకరించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అందుకే కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. కంటోన్మెంట్ కారణంగా ఉత్తర తెలంగాణ నుంచి నగరానికి వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంజాగుట్ట, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వివరించారు. దేశంలో ఎన్నో నగరాలున్నా ప్రధానంగా ఐదు నగరాల గురించి మాత్రమే చర్చించుకుంటాం. పొలిటికల్ రాజధానిగా ఢిల్లీ, ఫైనాన్షియల్ కేపిటల్ ముంబై, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల గురించి చర్చించుకుంటాం. పొలిటికల్ కేపిటల్‌గా ఉన్న ఢిల్లీలో కాలుష్యం కారణంగా పాఠశాలలకు, ఆఫీసులకి సెలవులు ఇస్తున్నారు. ముంబైలో వర్షాలు వస్తే వరదలు వచ్చే పరిస్థితి. ఫైనాన్షియల్ కేపిటల్‌గా ఉన్న ముంబైలో నివసించలేని పరిస్థితి వుంటోంది. బెంగుళూరులో విపరీతమైన ట్రాఫికక్, చెన్నైలో వరదలతో ఇబ్బందులు పడే పరిస్థితి. హైదరాబాద్ రాక్స్ అండ్ లేక్స్ సిటీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# అంబలి కేంద్రానికి ఆదరణ




## సేవా తత్వాన్ని సహించలేని ప్రత్యర్థి పార్టీ నాయకులా? అధికారులా? ఆయన చిత్రపటాన్ని తొలగించాలని ఒత్తిడి

**కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 23:**

కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన అంబలి,చలివేంద్రం కేంద్రానికి అధిక మొత్తంలో ప్రజా ఆదరణ రావడంతోసేవాభావాన్ని కూడా రాజకీయ రణరంగంగా మార్చడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆర్యవైశ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంబలి, చలివేంద్ర కేంద్రంలో ఏర్పాటుచేసిన దాత చిత్రపటాన్ని తొలగించాలని ఓ అధికారి అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్యవైశ్య వర్గానికి చెందిన ఉద్యోగితో ఒత్తిడి చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆర్యవైశ్యులు కార్యాలయ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మానవత్వం మరిచి సేవా తత్వాన్ని కూడా రాజకీయ కోణంలో చూస్తూ రాజకీయ రణరంగ మారుస్తున్నారని ఈ విషయాన్ని విన్న పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు వివిధ రూపేనా ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నులతో ఇచ్చే పథకాలకే వారి సొంత సొమ్ము ఖర్చుపెట్టినట్టుగా వారి చిత్రపటాలను పెట్టుకుంటున్నారని, సొంతంగా ఖర్చులు భరిస్తూ సేవా కార్యక్రమం చేస్తుంటే ఓర్వలేకపోతున్నారా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో సత్యసాయి సేవా మందిరం వారు సత్యసాయి చిత్రపటాన్ని పెట్టి చలివేంద్రంలో త్రాగు నీటిని మాత్రమే అందించేవారు. అప్పట్లో ఆయన చిత్రపటాన్ని పెట్టి సేవ చేసేవారు. అధికారులు గతంలో ఎప్పుడు ఈ విధంగా వ్యవహరించలేదని, ప్రస్తుత అధికారుల వ్యవహార శైలిపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తు సేవా తత్వాన్ని రాజకీయ రణరంగంగా మార్చకూడదని, వివిధ పార్టీ నాయకులను ఆర్యవైశ్యులు వేడుకుంటున్నారు.



## సాల్మన్ రాజ్ కు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి -జిల్లా పాస్టర్ అసోసియేషన్ డిమాండ్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్**

క్రైస్తవుల సాధక బాధకాలు తెలిసిన సాల్మన్ రాజ్ కు ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని వనపర్తి జిల్లా పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ కేటి. బెంజిమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1983 నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పార్టీ కోసం పని చేస్తూనే క్రైస్తవుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి క్రైస్తవ సమాజ అభివృద్ధి కొరకు పోరాటం చేస్తున్నాడని ఆయన గుర్తు చేశారు. క్రైస్తవులకు చెందిన చర్చి స్థలాలతోపాటు సమాధుల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవడంతో పాటు క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను ధైర్యంగా ఎదుర్కొంటున్నారని వారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ యుగంధర్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ వీగల శ్రీకాంత్ జాయింట్ సెక్రటరీ రెవరెండ్ వేణు ట్రెజరర్ రెవరెండ్ డేవిడ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రెవరెండ్ గంధం బాలరాజు రెవరెండ్ కృప కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పు తీర్చలేదని వ్యక్తిపై హత్యాయత్నం

**నేటి ఫోకస్ న్యూస్ : బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ మార్చి 23**

సంగారెడ్డి (కంది): అప్పుగా తీసుకున్న డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, ఒక వ్యక్తిపై ఐదుగురు కలిసి ప్రాణాంతక దాడి చేసిన ఘటన ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలివేముల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఘటన వివరాలు:

కలివేముల గ్రామానికి చెందిన ముండేలా అనిల్ (35) అనే వ్యక్తి, సోమవారం (మార్చి 23) ఉదయం గ్రామంలోని కల్లు దుకాణానికి వెళ్ళాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన తలారి పాండు మరియు అతని భార్య సునీత అక్కడకు వచ్చి, అనిల్ తమకు ఇవ్వాల్సిన రూ. 1,00,000 అప్పు గురించి నిలదీశారు. అనిల్ ప్రస్తుతం తన వద్ద రూ. 50,000 మాత్రమే ఉన్నాయని చెప్పినప్పటికీ, వారు వినకుండా గొడవకు దిగారు.

ప్రాణాంతక దాడి:

గొడవ పెద్దది కావడంతో తలారి పాండు కల్లు సీసాతో అనిల్ తలపై బలంగా కొట్టాడు. అనంతరం సునీత తన కొడుకు సందీప్, బావ శేఖర్ మరియు అతని కొడుకు వినయ్‌లను అక్కడికి పిలిపించింది. వీరందరూ కలిసి అనిల్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో కర్రలతో విచక్షణారహితంగా కొడుతూ, కడుపు మరియు ఛాతిపై తన్నారు.

ప్రస్తుత పరిస్థితి: ఈ దాడిలో అనిల్ తల, కుడి కన్ను మరియు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనిల్ అక్కడ చికిత్స పొందుతున్నాడు. బాధితుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అసెంబ్లీ ముట్టడిలో వనపర్తి బిజెపి నాయకుల అరెస్ట్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్**








రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వనపర్తికి చెందిన బిజెపి నాయకులు అసెంబ్లీ ముట్టడి చేపట్టగా పోలీసులు అరెస్టు చేసి ఆసిఫ్ నగర్ పోలీసు స్టేషన్ కు తరలించినట్లు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు పిలుపుమేరకు పక్కా వ్యూహంతో అసెంబ్లీ ముట్టడి చేశామని వారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు, 420 మోసపూరిత హామీలతో గద్దె ఎక్కి 27 మాసాలైన ఒక్క హామీ కూడా అమలు చేయకుండా రైతులు, మహిళలు, నిరుద్యోగులను మోసం చేసిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి యువమోర్చా జిల్లా అధ్యక్షులు అరవింద్ నాయకులు అంజి యాదవ్ చాణక్య చంద్రశేఖర్ వరుణ్ కుమార్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మురళీధర్ రావుకు స్వాగతం పలికిన వేణుమాధవ్

**నేటి ఫోకస్ న్యూస్ : బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ మార్చ్ 23**

బిజెపి జాతీయనాయకుడు మురళీధర్రావు ఝరాసంఘంలోని కేతకి సంగమేశ్వరదేవాలయానికి పూజలు చేయడానికి వస్తున్న సందర్భంగా బిజేపీ మాజి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నెమలికొండ



వేణుమాధవ్ ఆధ్వర్యంలో బిజెపి నేతలతో కలిసి స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. సోమవారం సదాశివపేట బైపాస్ రోడ్లో హైద్రాబాద్ నుండి ఝరానంఘం కు వెళుతున్న బిజెపి జాతీయ నాయకుడు మురళీధరరవుకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నర్సింలు, నందు, రాము, నవీన్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత బస్సులతో ఊపిరాడని ఆటో బతుకులు...

### ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య

**హైదరాబాద్,మార్చి23 (నేటి ఫోకస్ న్యూస్):**
ఈ అసెంబ్లీ సమావేశాల బడ్జెట్‌లో కూడా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో ప్రతిఫలించకపోవడం ఆటో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటోలకు గిరాకి తగ్గిపోవడంతో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫైనాన్స్ చెల్లింపులు చేయలేక, కుటుంబ పోషణ భారమై అనేక కుటుంబాలు కష్టాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని మారయ్య డిమాండ్ చేశారు. అలాగే సంవత్సరానికి ?12,000 ఆర్థిక సహాయంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. సమస్యలు పట్టించుకోకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

## అరెస్టులతో భయపెట్టలేరు... పోరాటం ఆగదు --బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి

**పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరిగంటి సైదులు మార్చి 23**



రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గారి ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరవ్వడానికి సిద్ధమవుతున్న బీజేపీ నాయకులు మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి, ప్రధాన కార్యదర్శి ముద్రబోయిన శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఆనంద్,ఎయిఎఎ మండల అధ్యక్షుడు మెరుగు సందీప్ గారిని ముందస్తుగా ఉదయం 5 గంటలకు పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండనీయమని ఘాటుగా విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కులను అణగదొక్కేందుకు ప్రభుత్వం ఇలాంటి అక్రమ చర్యలకు దిగడం దారుణమని అన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను ముందుగానే నిర్బంధించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని భాస్కరా చారి మండిపడ్డారు. అయితే ఇలాంటి అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపలేరని, రైతులు, నిరుద్యోగులు, మహిళల సమస్యలపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# బిజెపి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

### పైండ్ల రాజేష్

**తొర్రూర్ నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 23**
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినహామీలను నెరవేర్చకుండా, కాలయాపన చేస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఆరు గ్యారెంటీలు 420 హామీలతో ప్రజలను మోసగించి పబ్బం గడుపుతున్న రేవంత్ రెడ్డి సర్కారుని నిలదీస్తూ కళాశాల విద్యార్థినులకు స్కూటీలు, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు,?4000లకు పింఛన్ పెంపు, ?500లకు గ్యాస్ సిలిండర్ , నిరుపేద నవ వధువులకు తులం బంగారం వెంటనే ఇవ్వాలి అని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్ రాంచందర్ రావు గారు ఇచ్చిన పిలుపుతో ఈరోజు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న నాయకులను ఉదయం 4గం. లకు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు



తరలించడం ప్రశ్నించే గొంతుకను నొక్కేయడమే అని పైండ్ల రాజేష్ ఈ సందర్భంగా అన్నారు. అరెస్టు అయిన వారిలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లె కుమార్ జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు గంధం రాజు మాజీ జిల్లా ఎస్సీ అధ్యక్షుడు తూర్పాటి సాయి ముఖేష్ దీజీవీ నాయకులు కాగు నవీన్ నూకల నవీన్ అరెస్టు చేయడం జరిగింది అనంతరం సొంత కూచీ కత్తుపై విడుదల చేయడం జరిగింది

# విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం..

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్):**
తెలంగాణ మంత్రివర్గం కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లును (హేట్ స్పీచ్) మంత్రివర్గం ఆమోదించింది. మతసామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు.
దీనితో పాటు సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు మద్దతుగా ఉండాలనే లక్ష్యంతో పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి వేతనం నుంచి 15 శాతం లేదా రూ. 10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.
ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం తీసుకువచ్చే బిల్లులకు ఆమోదం తెలిపింది.
విశ్వవిద్యాలయాల్లో వివక్షను అరికట్టేందుకు 'రోహిత్ వేముల' చట్టం విధివిధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు.

## అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం...హరీష్ రావు వర్సెస్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ....

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్):**
రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు.
ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు.
హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు.
ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం: రేవంత్ రెడ్డి...

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్):**
పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ. 15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు.

నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.